క్లుప్తంగా

సీపీఐ నగర కార్యదర్శిగా శ్రీనివాసరావు



ఒంగోలు టౌన్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నగర కార్యదర్శిగా శ్రీరాం శ్రీనివాస రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో జరిగిన సీపీఐ నగర మహాసభలలో ఈ ఎంపిక జరిగినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 33 మందితో నగర కమిటీని, గౌరవ ఆహ్వానితులుగా ఏడుగురిని ఎన్నుకున్నట్లు చెప్పారు. సీనియర్ నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లును ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలలో నగరానికి ప్రతి రోజు మంచినీరు సరఫరా చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలాన్ని రెండు సెంట్లుగా మార్చి వెంటనే పట్టాలు పంపిణీ చేయాలన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని, దత్తాత్రేయ కాలనీ, సరళాదేవి నగర్ , కార్మిక నగర్ వాసులకు వెంటనే పట్టాలు ఇచ్చి ఆయా కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలని, నగర పాలక సంస్థలోని అన్నీ వార్డులలో గ్రామ సభలు నిర్వహించి ప్రజల ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేయాలని తీర్మానాలు చేసినట్లు తెలిపారు.

బైకును ఢీకొట్టిన కారు

మద్దిపాడు: బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని వెల్లంపల్లి సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బసవన్న పాలేనికి చెందిన నల్లూరి కృష్ణారావు వెల్లంపల్లి సమీపంలో రోడ్డును దాటుతుండగా గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్లే కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణారావుకు కుడికాలు విరిగిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మద్దిపాడు పోలీసులు కారును సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటసాగు పత్రాలతో ఉపయోగాలు



మాట్లాడుతున్న తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: పంటసాగు పత్రాలతో ఉపయోగాలు ఉంటాయని తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంటసాగు పత్రాలపై వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది మండలానికి 1129 పంట సాగు హక్కు పత్రాలు టార్గెట్‌గా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కౌలుకు సాగు చేసే రైతులను గుర్తించి పంట సాగు హక్కు పత్రాలను కౌలు రైతులకు అందించాలని ఆమె సూచించారు. కౌలు రైతులకు 11 నెలల కాల వ్యవధిలో వీటిని ఇస్తారన్నారు. భూమి మీద ఎలాంటి హక్కులు కౌలు రైతులకు ఉండవన్నారు. కార్యక్రమంలో ఏవో పావని, ఏఈవోలు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

కొమరోలు: మండలంలోని ఇడమకల్లు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. నిందితుల నుంచి 4200 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి అనర్థం

గిద్దలూరు రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని మానుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి సూచించారు. మండలంలోని కేఎస్‌పల్లె గ్రామంలో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లతో వాటిల్లే ముప్పు గురించి గ్రామంలోని కిరాణా దుకాణాల యజమానులకు వివరించారు. జనపనార, వస్త్రంతో తయారు చేసిన సంచులను ఉపయోగించాలని కోరారు. అనంతరం రామాలయం వద్ద పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈఓఆర్డీ చెన్నారావు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సవరణకు అవకాశం

గిద్దలూరు రూరల్: ఓటరు జాబితాలో తప్పులను గుర్తించి వాటిని సవరించుకునే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని ఈఆర్ఓ ఎం.వెంకటశివరామిరెడ్డి కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలో పేర్లు, పుట్టిన తేదీ, చిరునామాను పరిశీలించుకోవాలని చెప్పారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఓటర్ల జాబితాలు పకడ్బందీగా రూపొందించేందుకు రాజకీయ నాయకులు ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కోసం అందరం కష్టపడాలి

- గ్రామ కమిటీల ఎంపికలో నియోజకవర్గ ఇన్‌చార్జి నాగార్జున



నేకునంబాదు గ్రామ కమిటీ సభ్యులతో ఇన్‌చార్జి నాగార్జున, పార్టీ శ్రేణులు



పల్లామల్లి గ్రామ కమిటీ నాయకులతో మేరుగు నాగార్జున, పార్టీ శ్రేణులు

చీమకుర్తి రూరల్: పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిచ మాజీ మంత్రి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. మండలంలోని నేకునంబాదు గ్రామంలో పార్టీ బలోపేతానికి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీని ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి సూచనల మేరకు ఆయన, మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, మండల నాయకులు సంయుక్తంగా ఎంపిక చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు వల్లెపు వేణు, ఉపాధ్యక్షుడు బొల్లేపల్లి వెంకటేశ్వరరాజు, బత్తిన ఏలియా, బీసీ సెల్ అధ్యక్షుడు సరికొండ వెంకటరామరాజు, బూత్ కన్వీనర్ సరికొండ పూర్ణచంద్ర రాజు, రైతు విభాగం అధ్యక్షుడు బత్తిని వెంకటస్వామి, యువజన విభాగం అధ్యక్షుడు బత్తిని మహేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు బత్తిని ప్రమీల, సేవాదళ్ అధ్యక్షుడు పేరిపోగు రామయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బత్తిని పరంజ్యోతి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొలకలూరు మేషక్, ప్రధాన కార్యదర్శులు ప్రతికంతం సత్యం రాజు, సరికొండ ప్రసాద్ రాజు, బత్తిని సలోమాన్, కార్యదర్శులు గుంజి అహరోను బత్తిని మల్లేశ్వరి ఇండ్ల పెదరామ కోటయ్య సరికొండ వనజ, కార్యవర్గ సభ్యులు మంద సల్మాన్, కొలకలూరి లింగయ్య, మందా మార్కు పెనుమాక సుబ్బారావు, గండి కోటేశు, బత్తిని ఇశ్రాయేలు, బత్తిని బెంజిమెన్, కర్నాటి నాగేశ్వరావు, పెనుమాక సుబ్బయ్య. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్ రెడ్డి మండల ఉపాధ్యక్షుడు యన్నం శేషరెడ్డి, గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్లామల్లి గ్రామ కమిటీలు ఎంపిక..

గ్రామ అధ్యక్షుడిగా గనిపినేని వినయ్ కుమార్, ఉపాధ్యక్షులు డీ కృష్ణారెడ్డి, డీ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బెల్లం ఆంజనేయులు కర్నాటి రాంబాబు, కార్యదర్శులు పాత్తూరి ఆనంద్, ఏ అంజిబాబు, ఆకాష్ కుంచాల, సేవ బీ అంకారావు, కార్యవర్గ సభ్యులు షేక్ ఖాదర్ బాబు, మిరియాల నవీన్, జగన్నాథ నవీన్, ఎస్ ముసలయ్య, సాకలి వెంకటేశ్వర్లు, ఎస్ బ్రహ్మయ్య , బూత్ కన్వీనర్స్ పి వెంకటేశ్వర్లు, కే రాంబాబు, గండి వీరాంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బీ తిరుపతయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి బ్రహ్మయ్య, యూత్ అధ్యక్షుడు భూతలపల్లి నాగరాజు, రైతు విభాగం కె అంకయ్య, సేవాదళ్ పి రాఘవేంద్ర, మహిళా విభాగం బీ బుల్లెమ్మాయి, విద్యార్థి విభాగం షేక్ నాగూర్ బాషాలు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గండి రోశయ్య, బోతలపల్లి కోటయ్య, షేక్ హసన్ బుడి, నల్లపాటి వెంకటేశ్వర్లు, గండి నాగమ్మ, ఎంపీటీసీ నామినేని కృష్ణయ్య, వల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బూచేపల్లిని కలిసిన మేరుగు చందన్



ఎమ్మెల్యే బూచేపల్లికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చందన్ నాగ్

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నూతనంగా నియమించబడిన మేరుగు చందన్ నాగ్ మంగళవారం చీమకుర్తిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బూచేపల్లి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతనంగా పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నియమించిన తర్వాత తొలిసారి బూచేపల్లిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక నైపుణ్య శిక్షణతోనే ఉద్యోగాలు



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న విద్యా సంస్థల వైస్ చైర్మన్ శ్రీగాయత్రి



క్విస్ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: ప్రతి విద్యార్థికి కాలేజీలో ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోనే ఉద్యోగాలు సాధించారని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం క్విస్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌కు సంబంధించిన అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో రికార్డు స్థాయిలో 928 మందికి ఉద్యోగాలు వచ్చాయని, ఇది గర్వకారణమని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి కేవలం చదువుతోపాటు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం మాప్రత్యేకత అని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ట్రినెట్ జీసీఈ కార్పొరేట్ కంపెనీ ప్రతినిధి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో ఉద్యోగాలు రావడం అంత సులభం కాదని, క్విస్ విద్యార్థులకు మొదటి నుంచి ఇస్తున్న స్పెషల్ ట్రైనింగ్ వల్లే ఇది సాధ్యం అయిందని చెప్పారు. పెద్ద యూనివర్సిటీలు, కాలేజీలకు రాని ఉద్యోగాలు మీకు ప్లేస్ మెంట్స్ మీకు వచ్చాయంటే మీకు ఎంత ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారో అర్థం అవుతుందని చెప్పారు. విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ నిడమానూరి శ్రీగాయత్రి మాట్లాడుతూ విద్యార్థులు, ఫ్యాకల్టీ, హెచ్‌వోడీలు, ముఖ్యంగా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ వాళ్ల కృషి ఫలితంగా ఇన్ని ఉద్యోగాలు సాధించామన్నారు. విద్యాసంస్థల అధినేత సూర్య కల్యాణ్ చక్రవర్తి విజన్‌తో ఎన్నో ప్రత్యేక కోర్సులు, ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. దాని ఫలితం ఈ రోజు కళ్ల ముందు కనిపిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించి మెమొంటోలతో సత్కరించారు.

కార్యక్రమంలో ప్లేస్ మెంట్ సెల్ డీన్ డాక్టర్ జగదీశ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిశోర్‌బాబు, హెచ్‌వోడీలు, డీన్‌లు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’లో నిరసన గళమెత్తండి



మేరుగు నాగార్జున

సంతనూతలపాడు : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు.. నేడు బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మోసకారి అయిన చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ప్రజల్ని వంచిస్తూ, వారిపై పన్నుల భారం మోపుతూ, ఏపీని అప్పుల ఊబిలో నెట్టేసి తన ఖజానా నింపుకుంటున్నారని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేయడాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. సంతనూతలపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమై బస్టాండ్ మీదుగా సాగుతుందని తెలిపారు. కావున నియోజకవర్గంలోని చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు కొత్తపట్నం: ప్రజలకు హామీలు ఇచ్చి వాటిని గాలికి వదిలేసిన చంద్రబాబు చేసిన మోసాలు, అరచాకాలు, అన్యాయాలు అక్రమాలు ఎండగడుతూ బుధవారం ఒంగోలులో జరిగే నిరసన కార్యక్రమానికి మండల నాయకులు తరలి రావాలని ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు.

మెగా ఫెయిర్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2025 బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం ఆవిష్కరించినట్లు బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ అధినేత డాక్టర్ షేక్ న్యామత్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరు షేక్ న్యామత్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన ఏ1 కన్వెన్షన్‌లో జరుగుతుందని తెలిపారు. ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కాలేజీల్లో చేరబోయే విద్యార్థులకు వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు, స్పెషల్ కోర్సులతో పాటు, కెరీర్ గైడెన్స్ కూడా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ డాక్టర్ తోహారా, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. లక్కీ డీప్ ద్వారా ల్యాప్‌టాప్‌లను అందిస్తామని, ఎంట్రీ పాస్‌ల కోసం, ఫ్రీ బస్‌పాస్‌ల కోసం 80194 79999 నెంబర్‌కి కాల్ చేసి పొందవచ్చని తెలిపారు.

టీబీని నిరోధించేందుకు నడుం కట్టాలి



సిబ్బందితో జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవాణి

మద్దిపాడు: టీబీని దేశం నుంచి ప్రారదోలడానికి ఆరోగ్యశాఖ ఉద్యోగి నడుం బిగించాలని జిల్లా టీబి యూనిట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవాణి అన్నారు. మంగళవారం మండలంలోని దొడ్డవరం గ్రామంలో వంద రోజుల టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీని పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకుందని ఆమె తెలిపారు. 60 ఏళ్లు దాటిన వ్యక్తులు మద్యపానం, పొగతాగటం, లేదా పౌష్టికాహార లోపం వలన కూడా టీబీ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో 60 ఏళ్లు దాటిన ప్రతి వ్యక్తిని గమనిస్తూ వారిలో వారం రోజులు పాటు దగ్గుతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి క్లోజ్ పరీక్షలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆమె వెంట డాక్టర్ అన్వేష్, సీహెచ్‌ఓలు లలితమ్మ, రజిత కుమారి, హెల్త్ సూపర్వైజర్ బాలకోటయ్య పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో యథేచ్ఛగా వ్యభిచారం

- పట్టించుకోని పోలీసులు
- అసాంఘిక కార్యకలపాలకు అడ్డగా మారుతున్న వైనం

ఒంగోలు టౌన్: నగర శివారులోని రాజీవ్ గృహకల్పలో యథేచ్ఛగా వ్యభిచారం జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రెండు నెలల క్రితం కాలనీలో మొదటి లైనులో స్థానికుల ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. అయినప్పటికీ అక్కడ ఇంకా వ్యభిచారం కొనసాగుతోందని సమాచారం. మొదటి వీధిలోని అడ్డరోడ్డులో ఓ గృహంలో పగలు, రాత్రి తేడా లేకుండా వ్యభిచారం జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలో వైద్యారోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఒక ఉద్యోగి మరో స్నేహితుడితో కలిసి ప్రతి రోజు అమ్మాయిలను తీసుకొస్తున్నట్లు చెప్తున్నారు. అలాగే కాలనీలో 6వ లైను చివర కూడా ఒక వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. ఇందిరమ్మ కాలనీలో కూడా వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం. కొప్పోలులో హిజ్రాల బెడద ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు. రాత్రి 10 గంటల తరువాత నుంచి వేకువజాము వరకు రోడ్డు మీద కాపు కాసి వచ్చి పోయే వారిని వేధిస్తున్నారని చెప్తున్నారు. ఈ ప్రాంతంలో గంజాయి, మద్యం బహిరంగంగానే తాగుతున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద బాషా అనే వృద్ధుడి హత్య జరగడం తెలిసిందే. కొప్పోలు పరిసరాలలో చిత్తు కాగితాలు ఏరుకునే ఇద్దరు యువకులు ఈ హత్య చేసినట్లు ప్రచారం జరిగింది. అయినప్పటికీ పోలీసులు ఈ ప్రాంతంలో గస్తీ నిర్వహించడం లేదని, దాంతో విచ్చలవిడిగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్రమిత స్థలాలు పరిశీలించిన సబ్‌కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకున్న ప్రాంతాన్ని మంగళవారం తహసీల్దార్ చిరంజీవితో కలిసి సబ్‌కలెక్టర్ త్రివినాగ్ పరిశీలించారు. జీఓ ఎంఎస్ నంబర్ 30 ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న కట్టడాలను క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో వీటిని పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు. సుమారు 145 మంది ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని, వీటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అధికారుల వెంట రెవెన్యూ సిబ్బందితోపాటు కౌన్సిలర్ హర్షిత ఉన్నారు.

బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలి

- సబ్ కలెక్టర్‌కు బీసీ సంక్షేమ సంఘ నాయకుల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఎల్పీ యాదవ్ తదితరులు

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో బీసీ బాలికలకు వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ నేత పీఎల్పీ యాదవ్, ఇండ్ల రంగస్వామిగౌడ్, నాయకులు రాజ్ కుమార్, అబ్రహం తదితరులు సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం వారు సబ్ కలెక్టర్‌ను కలిసి బాలికల సమస్యను వివరించారు. సుమారు 150 మందికిపైగా విద్యార్థినులు మార్కాపురం పట్టణంలో వివిధ ప్రైవేట్ హాస్టల్స్, అద్దె గదుల్లో ఉంటూ చదువుకుంటున్నారని, వీరి కోసం ప్రత్యేక వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం తరుపున ఈ సమస్యపై పలు దఫాలుగా అధికారులకు అర్జీలు అందజేశామన్నారు. బాలికలు ప్రైవేట్ హాస్టళ్లలో ఉండి చదువుకోవాలంటే తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోందని, దీంతో కొందరు చదువుకు దూరమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకుని అయినా వసతి గృహాన్ని ప్రారంభించాలని విన్నవించారు. ముఖ్యంగా పుల్లలచెరువు, త్రిపురాంతకం ప్రాంతాల నుంచి వస్తున్నటువంటి బాలికలకు హాస్టల్ వసతి ఏర్పాటు చేయడం ద్వారా డ్రాపౌట్స్‌ను నివారించవచ్చన్నారు. తమ వినతిపై సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారని పీఎల్పీ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, వెంకటేష్, నారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో చిరుజల్లులు



మార్కాపురం పట్టణంపై కమ్ముకున్న కారుమేఘాలు

మార్కాపురం టౌన్: మార్కాపురంలో మంగళవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. కారుమబ్బులు కమ్మేయడంతో సాయంత్రం 4 గంటలకే చీకటి పడినట్టుగా వాతావరణం మారిపోయింది. రోహిణి కార్తె ప్రభావంతో గత 4 రోజులుగా మళ్లీ ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వాతావరణం కాస్త చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. సోమవారం సాయంత్రం మార్కాపురంతో పాటు కొనకనకనమిట్ల మండలంలో ఓ మోస్తరు జల్లులు పడ్డాయి. మంగళవారం ఉదయం కూడా అక్కడక్కడా వర్షం కురిసింది.

కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన

మార్కాపురం: ప్రభుత్వం అందించే సబ్సిడీలు, సంక్షేమ పథకాలు పొందేందుకు కౌలు గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయని తహసీల్దార్ చిరంజీవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కౌలు సాగు హక్కు పత్రాల జారీపై వీఆర్ఓలు, వీఏఏలకు అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పంట సాగు హక్కు పత్రం పొందిన రైతుకు సాధారణ రైతుల మాదిరిగానే అన్ని పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కౌలు రైతులు పంట నష్టపోతే పరిహారం పొందే వీలుంటుందని, సబ్సిడీపై విత్తనాలు తీసుకోవచ్చని, అన్నదాత సుఖీభవ పథకం కూడా వర్తిస్తుందన్నారు. ఈ ఏడాది మార్కాపురం మండలంలో 1700 మంది రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి నాగంపల్లిలో ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం

కొనకనమిట్ల:

మండలంలోని నాగంపల్లిలో బుధవారం నుంచి మూడు రోజులపాటు పట్టాభిరామస్వామి ఆలయ నూతన ధ్వజ స్తంభ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం గణపతి పూజతో ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ, నూతన ధ్వజ స్తంభ గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం రాత్రి కోలాట ప్రదర్శన, శుక్రవారం తిరుపతి ఆగమ పండితులతో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, పట్టాభిరామస్వామి శాంతి కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.



ముస్తాబైన పట్టాభిరామస్వామి ఆలయం

5న ‘చలో విజయవాడ’కు ఉద్యోగులు తరలిరావాలి

కంభం: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన విజయవాడ లయోలా కాలేజీలో నిర్వహిస్తున్న రాష్ట్ర కౌన్సిల్ మూడో మహాసభలను విజయవంతం చేయాలని కంభం తాలూకా అధ్యక్షుడు ముక్కు ప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చలో విజయవాడ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన మధ్యంతర భృతి, 12వ పీఆర్సీ, డీఏ బకాయిలు తదితర 14 హక్కుల సాధనకు అన్ని శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లతో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగస్వామిరెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.